సాక్షి
సంగారెడ్డి
శుక్రవారం । 14 । మార్చి । 2025




'బోరు'మంటున్నారు!

కోహెడ మండలంలో భూగర్భజలాలు అడుగంటిపోవడంతో సాగునీరులేక అన్నదాతలు బోరుమంటున్నారు. వివరాలు 8లో ▸



..మట్టి మాఫియా

ఉమ్మడి జిన్నారం, గుమ్మడిదల మండలాలు అక్రమ మట్టి దందాకు కేంద్రాలుగా మారాయి. వివరాలు 9లో ▸



న్యూస్‌రీల్

సహజ రంగులతోనే హోలీ జరుపుకోవాలి

జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



సంగారెడ్డి జోన్: జిల్లా ప్రజలు హోలీ పండుగను శరీరానికి, పర్యావరణానికి హాని కలిగించని సహజసిద్ధమైన రంగులతో ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. యువత మద్యం సేవించి వాహనాలను నడపడం, బహిరంగ ప్రదేశాలపై, ఇష్టం లేని వ్యక్తులపై, వాహనాలపై రంగులు, రంగు నీళ్లు చల్లడం వంటివి చేయకూడదని స్పష్టం చేశారు. బైకులపై, కార్లల్లో గుంపులుగా తిరిగి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలే

డీఎంహెచ్‌వో గాయత్రీదేవి స్పష్టీకరణ

సంగారెడ్డి: ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి గాయత్రీదేవి హెచ్చరించారు. జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో గురువారం పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ధరల పట్టికను ప్రతీ ఆస్పత్రిలో విధిగా ప్రదర్శించాలన్నారు. ప్రతీ ఆస్పత్రిలో జరిగిన కాన్పుల వివరాలను రిజిస్టర్‌లో పొందుపరిచి జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో అందజేయాలని ఆదేశించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాతా శిశు కేంద్రం కార్యక్రమ అధికారి నాగనిర్మల, మాస్ మీడియా అధికారి ప్రసాద్ కుమార్, డీపీవో సిద్ధార్థ, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ మంగమ్మ, సిబ్బంది వనిత, జ్యోతి ఆస్పత్రుల యజమానులు, స్కానింగ్ సెంటర్ యజమానులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

- కలెక్టర్ వల్లూరు క్రాంతి
- మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలి
- స్టడీ మెటీరియల్ వినియోగించుకోవాలి

సంగారెడ్డి జోన్: విద్యార్థులు చదువుకుంటేనే ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుందని కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షలు సమయం దగ్గర పడుతోందని, విద్యాశాఖ తరపున అందజేసిన స్టడీ మెటీరియల్ చదవాలని సూచించారు. కొండాపూర్ మండలంలో అధికారులతో కలసి గురువారం విస్తృతంగా పర్యటించారు. పర్యటనలోభాగంగా సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం, కేజీబీవీ బాలికల పాఠశాల, ఇందిరమ్మ ఇళ్లను కలెక్టర్ పరిశీలించారు. కస్తూర్బా బాలికల పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించిన అనంతరం విద్యార్థులతో చదువు, యోగా, కృత్రిమ మేధ (ఏఐ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్)పై పలు ప్రశ్నలు అడిగారు. విద్యార్థులు సమాధానాలు చెప్పడంతో వారిని ప్రశంసించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. విద్యార్థులు పాఠ్యాంశాలను చేతిరాతతో రాస్తూ చదువుకోవాలని చెప్పారు. కస్తూర్బా పాఠశాల విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని సూచించారు. చెప్పారు. ఇక ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పీడీ హౌసింగ్ చలపతిరావు, ఏఈ మాధవరెడ్డి పాల్గొన్నారు.

హోలీ పండుగ శుభాకాంక్షలు

ప్రజలందరికీ ఆనందం కలిగేలా, శాంతి, సామరస్యంతో హోలీ వేడుకలు జరుపుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. హోలీ అనేది ప్రేమ, స్నేహానికి, భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకని పేర్కొన్నారు. సహజమైన, ఆరోగ్యానికి హాని కలిగించని రంగులతోనే నీటిని వృథా చేయకుండా హోలీ వేడుకలు జరుపుకోవాలని సూచించారు.



గురువారం కొండాపూర్ మండలంలోని కేజీబీవీ విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

పిల్లల సంక్షేమానికి కృషి చేయాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర

సంగారెడ్డి టౌన్: పిల్లల సంక్షేమం కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీ చంద్ర పేర్కొన్నారు. జిల్లా కోర్టులో జువైనల్ జస్టిస్ చట్టం, పోక్సో చట్టాలపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...పిల్లలకు బాలల హక్కుల మీద ఉన్న చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. బాల్యవివాహాల చట్టాల మీద అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పంకజ్, జిల్లా జడ్జీలు, న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీ చంద్ర

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

ఆస్ట్రియాలోని ఏటీ–ఎస్ గ్లోబల్ డైరెక్టర్ డాక్టర్ వెంకట్

పటాన్‌చెరు: అభివృద్ధి చెందుతున్న అధునాతన సాంకేతికతలను వర్ధమాన ఇంజనీర్లు అందిపుచ్చుకోవాలని ఆస్ట్రియాలోని ఏటీ అండ్ ఎస్ ఏజీలో అప్లికేషన్ ఇంజనీరింగ్ గ్లోబల్ డైరెక్టర్ డాక్టర్ వెంకట్ మొక్కపాటి సూచించారు. పటాన్‌చెరు మండలం రుద్రారం గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఈఈసీఈ విభాగం ఆధ్వర్యంలో 'అధునాతన సెమీకండక్టర్ ప్యాకేజింగ్ టెక్నిక్స్'పై గురువారం ఆయన ప్రసంగించారు. టూడీ, త్రీడీ, అభివృద్ధి చెందుతున్న ఫోర్ డీ ప్యాకేజింగ్‌తో సహా సెమీకండక్టర్ ప్యాకేజింగ్ టెక్నాలజీలలో తాజా పురోగతుల గురించి డాక్టర్ మొక్కపాటి విలువైన సమాచారాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. ఫోర్ డీ పరిజ్ఞానంలోని మడత లేదా ఒంపు ద్వారా అన్ని భాగాలకు విద్యుత్ కనెక్టివిటీని పెంచుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నాన్న హమాలీ.. కూతురు లెక్చరర్

- జేఎల్ పరీక్షల్లో రాష్ట్రంలో మొదటిర్యాంకు సాధించిన ఫాతిమా
- అభినందించిన గ్రామస్తులు

సదాశివపేటరూరల్ (సంగారెడ్డి): మండలంలోని ఇశ్రితాబాద్ గ్రామానికి చెందిన బాబుమియా సివిల్ సప్లై గోదాంలో హమాలీ పని చేస్తూ కూతుర్ని ఉన్నత చదువులు చదివించాడు. బాబుమియా కూతురు తస్లీమ్ ఫాతిమా చిన్నతనం నుంచి చదువులో చురుగ్గా ఉండేది. ఆమె చదువు పట్ల చూపుతున్న ఆసక్తిని గమనించిన తండ్రి బాబు మియా హమాలీ పని చేస్తూ కూతురిని ఎంఎస్సీ జువాలజీ (ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్) వరకు చదివించాడు. కాగా, తెలంగాణ పబ్లిక్ సరీ్వస్ కమిషన్ నిర్వహించిన జూనియర్ లెక్చరర్ పరీక్షలో తన ప్రతిభను చాటి రాష్ట్రంలోనే మొదటి ర్యాంకును సాధించింది. దీంతో ఈ నెల 12న బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్(జువాలజీ)గా ఎంపికై హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కొలువుల పండుగ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా నియామక పత్రాన్ని అందుకుంది. సదాశివపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జువాలజీ లెక్చరర్‌గా ఫాతిమా గురువారం ఉద్యోగంలో చేరారు. తండ్రి పడ్డ కష్టానికి కూతురు తగిన ఫలితం సాధించడంతో కుటుంబ సభ్యుల ఆనందానికి అవధుల్లేకుండాపోయాయి. గ్రామస్తులు, మాజీ సర్పంచ్ రాములు, నాయకులు శ్రీనివాస్, బంధువులు,స్నేహితులు ఆమెను అభినందించారు.



నియామక పత్రాన్ని తండ్రితో కలసి చూపిస్తున్న తస్లీమ్ ఫాతిమా

శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీక హోలి: ఎమ్మెల్యే చింతా

సంగారెడ్డి రూరల్: శాంతి సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలిచే హోలీ పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆకాంక్షించారు. సంగారెడ్డి నియోజకవర్గ, జిల్లా ప్రజలకు గురువారం ఓ ప్రకటనలో హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రకృతిమాత ప్రజలందరినీ చల్లగా చూడాలని ప్రార్థించారు.

డుమ్మా టీచర్లపై చర్యలు

జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు

నారాయణఖేడ్: పాఠశాల సమయాల్లో విధుల్లో ఉండకుండా డుమ్మాకొట్టిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు గురువారం 'సాక్షి'కి తెలిపారు. ఈ అంశంపై విచారణకు ఖేడ్ ఎంఈవోను ఆదేశించారు. కాగా టీచర్లపై చర్యలు తీసుకోకుండా ఉండేందుకు స్థానిక అధికారులు సహకరించే ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సాక్షి ఎఫెక్ట్

డివిజన్ కేంద్రమైన నారాయణఖేడ్ పట్టణానికి కిలోమీటర్ దూరంలో ఉన్న జూకల్ పాఠశాలలో బుధవారం మధ్యాహ్నం 12.30గంటలకు ఇద్దరు టీచర్లు బాబురావు, కవిత డుమ్మాకొట్టి వెళ్లిపోయారు. దీంతో విద్యార్థులు ఆరుబయట ఆడుతూ కన్పించారు. టీచర్ల డుమ్మాపై 'సాక్షి' దినపత్రికలో 'పాఠశాలలో టీచర్ల డుమ్మా' శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే.

క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీలకు ముగ్గురు ఎంపిక


ప్రణయ్


చేతన్


యువతేజ్

మిరుదొడ్డి(దుబ్బాక): జాతీయ స్థాయి యూనివర్సిటీ క్రీడా పోటీలకు మిరుదొడ్డి మండల కేంద్రానికి చెందిన క్రీడాకారులు మద్దెల ప్రణయ్, అందె చేతన్, వేముల యువతేజ్ ఎంపికయ్యారు. 5,6 తేదీల్లో జరిగిన యూనివర్సిటీ బాల్ బాడ్మింటన్ క్రీడా పోటీల్లో మంచి ప్రతిభ కనబర్చడంతో ఉస్మానియా యూనివర్సిటీ, జేఎన్‌టీయూ జట్లకు వీరు ఎంపికయ్యారు. కర్ణాటక రాష్ట్రంలోని బెంగుళూరు నార్త్ యూనివర్సిటీలో 14 నుండి 17 వరకు జరిగే జాతీయ స్థాయి యూనివర్సిటీ బాల్ బాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొననున్నారు. క్రీడాకారుల ఎంపికపై ఉమ్మడి మెదక్ జిల్లా బాల్ బాడ్మింటన్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీటీసీ గొట్టం భైరయ్య, మంజీరా యూత్ సభ్యులు అందె రామచంద్రం, తోట వెంకట్‌రెడ్డి, చెన్నై భూపాల్‌గౌడ్, బోయిని శ్రీను తోపాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

గ్రూప్ 1, 2లో సత్తాచాటిన సోదరులు


వెంకటేశ్


హరికృష్ణ

బెజ్జంకి(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల వెలువరించిన గ్రూప్ 1, గ్రూప్ 2 ఫలితాల్లో మెరుగైన ర్యాంకులు సాధించి మండలంలోని గుగ్గిల్ల గ్రామానికి చెందిన సీత లక్ష్మి, కొమురయ్య దంపతుల కుమారులు వెంకటేశ్, హరికృష్ణ సత్తా చాటారు. గ్రూప్ 1లో పెద్ద కుమారుడు వెంకటేశ్ 466వ మార్కులు సాధించాడు. ఇతడు ప్రస్తుతం కొత్తగూడెం థర్మల్ పవర్ జెన్‌కో స్టేషన్‌లో ఏఈగా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. చిన్న కుమారుడు హరికృష్ణ సివిల్స్ ప్రిపేరవుతూ గ్రూప్ 2లో 184వ ర్యాంకు సాధించాడు. ఇద్దరు సోదరులను గ్రామస్తులు అభినందించారు.

'రాజు పవార్' పాంచ్ పటాకా



టేక్మాల్(మెదక్): మండలంలోని షాబాద్ తండాకు చెందిన రాజు పవార్ పోటీ పరీక్షల్లో సత్తా చాటి ఐదు ఉద్యోగాలు సాధించాడు. 2008 డీఎస్సీలో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ సాధించి టేక్మాల్‌తో పాటు కల్హేర్, హవేళిఘనాపూర్, చాప్ట- కె, హనుమంతరావుపేట ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేశారు. గతేడాది జూనియర్ లెక్చరర్ కొలువు సాధించి కామారెడ్డి జిల్లా బిచ్కుందలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల విడుదలైన గ్రూప్- 2లో 353 మార్కులను సాధించి రాజన్న సిరిసిల్ల జోన్ ఎస్టీ విభాగంలో రెండో ర్యాంకు సాధించాడు. అలాగే గ్రూప్-1లో 456 మార్కులు సాధించి సత్తా చాటాడు. ఈసందర్భంగా రాజు పవార్‌ను మండల ప్రజలు, తోటి మిత్రులు అభినందించారు.

టోల్ బూత్‌ను ఢీకొట్టిన కారు


ప్రమాద స్థలిలో కారు

చిన్నశంకరంపేట(మెదక్): కారు అదుపుతప్పి టోల్ బూత్‌ను ఢీకొట్టిన ఘటన నార్సింగి జాతీయ రహదారిపై వల్లభాపూర్ వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గురువారం సాయంత్రం నిజామాబాద్ వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న టోల్ బూత్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

ట్రాక్టర్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు

దుబ్బాకటౌన్: రాయపోల్ మండల కేంద్రానికి చెందిన బైండ్ల సత్తయ్య గురువారం వ్యవసాయ పొలానికి ట్రాక్టర్ పై వెళ్తుండగా అదుపు తప్పడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా అక్కడికి చేరుకొని క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స అందించి గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బోరుమంటున్నారు!


కోహెడలో బావిలో పూడిక తీయిస్తున్న రైతు

అడుగంటిన భూగర్భ జలాలు
- సాగుకు తప్పనితిప్పలు
- నీటి కోసం బోర్లు, బావుల్లోనూ సైడ్ బోర్లు
- చుక్క నీరుపడని వైనం
- అప్పుల పాలవుతున్న రైతులు
- ఎండిపోతున్న పంటలు


అడుగంటిన వ్యవసాయ బావి


సాగు నీటి కోసం బోరు వేస్తున్న రైతు

కోహెడ(హుస్నాబాద్): సాగునీటి కోసం అన్నదాతలు భగీరథ ప్రయత్నాలు చేస్తూ బోరు మంటున్నారు. మండల వ్యాప్తంగా గత నెల నుంచి భూగర్భజలాలు పూర్తిగా అడుగంటాయి. దీంతో బోరు, బావుల్లో నీరు తగ్గుముఖం పడుతుంది. ఈ క్రమంలో సాగు నీటి కష్టాలు మొదలైయ్యాయి. వరి, మొక్కజొన్న పంటలకు నీరు అందకగా ఎండుముఖం పడుతున్నాయి. వరికి ఇప్పటి నుంచే వరుస తడులు పెట్టుకుంటూ కాపాడుకుంటున్న పరిస్థితి.

మండల వ్యాప్తంగా ఉన్న రైతులు బావులు, బోరుబావులపై ఆధారపడి 2,2150 ఎకరాలు వరి సాగు చేశారు. ఇందులో సగానికి పైగానే వరి చేనులు ఎండుముఖం పట్టి పశువులకు మేతగా మారాయి. సింగరాయ, శనిగరం ప్రాజెక్టు పరిధిలోని వరి సాగుకు నీటి ఎద్దడి ఇప్పటి వరకు ఇబ్బంది ఏమిలేదు. ఇవి మినహాయించి మిగితా చోట సాగు నీటి ఎద్దడి నెలకొంది. మొక్కజొన్న 2,540 ఎకరాలు సాగు చేయగా 250 ఎకరాలు దెబ్బతిందని సమాచారం.

బోరుబండ్ల వైపు పరుగులు

నీటి ఎద్దడితో కళ్లెదుట పంటలు ఎండుముఖం పడుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలను కాపాడు కోవడం కోసం బావుల్లో పూడిక తీయిస్తున్నారు. సైడ్ బోర్లు వేస్తున్నారు. నీటి మట్టం తగ్గడంతో నీటి ఊటలు సైతం అడుగంటి చుక్క నీరు రావడం లేదు. అలాగే బోర్లు వేయడం కోసం బోరు బండ్ల వద్దకు రైతులు పరుగులు తీసున్నారు. కొత్తగా 350 నుంచి 600 ఫీట్లు వరకు బోరు వేసినప్పటికీ చుక్క నీరు పడటం లేదు. బోరు వేసినందుకు బండ్ల యజమానులు ఫీటుకు రూ.85 నుంచి రూ.110 వరకు ధర తీసుకుంటున్నారు. ఈ లెక్కన బోరు వేయాలంటే తక్కువలో తక్కువ రూ.30 వేల నుంచి రూ.66 వేల వరకు ఖర్చు అవుతుంది. నీరు పడకపోవడంతో రైతులు అప్పుల పాలవుతున్నారు. దీంతో ఏం పాలుపోక ఆందోళన చెందుతున్నారు.

పొలానికి నీరందుతలేదు



రెండున్నర ఎకరాలు వరి పెట్టిన. బావిలో నీల్లు అడుగంటి పోయాయి. బావిలో ఆరు గంటలు నీళ్ల ఊరుతుండే. రెండు వారాల నుంచి రెండు గంటలే ఊరుతున్నాయి. దీంతో పంటకు నీరు పారించేందుకు ఇబ్బంది అవుతుంది. పంట చేతుకొచ్చుడు కష్టమే.

– పేర్యాల నర్సింగరావు, రైతు కోహెడ

ఉచితంగా పూడిక తీయించాలి



వరికి నీళ్ల అందక తిప్పలైతుంది. బావుల్లో నీటి ఊటలు తగ్గాయి. నీళ్ల సరిపడక పోవడంతో పూడిక తీయిస్తున్న. పూడికకు రూ.40 వేలు ఖర్చు అవుతుంది. ప్రభుత్వం స్పందించి ఉచితంగా ఉపాధి హామీలో పూడిక తీయించాలి. సబ్సిడీపై డ్రిప్ పైపులు, బోర్లు బావులు మంజూరు చేయాలి. పంట నష్టంపై సర్వే చేసి నష్ట పరిహారం ఇవ్వాలి.

– రాగుల చంద్రమౌళి, రైతు కోహెడ

చోరీ సొత్తు స్వాధీనం

సీసీ కెమెరాల ఆధారంగా దొంగ గుర్తింపు


పోలీసులు స్వాధీనం చేసుకున్న సొత్తు

పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేటకు చెందిన విగ్రాం శ్రీనివాస్‌గౌడ్ నివాసంలో రెండు రోజుల కిందట బంగారం, నగదు చోరీకి గురైంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు గురువారం దొంగను గుర్తించి పట్టుకొని సొత్తులు స్వాధీనం చేసుకున్నారు. అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం ఇంటికి తాళం వేసి కర్ణాటకలోని గాన్‌గాపూర్‌కు వెళ్లాడు. బుధవారం ఇంటి తాళం పగులగొట్టి ఉండగా పని మనిషి గుర్తించింది. వెంటనే శ్రీనివాస్ గౌడ్ ఇంటి పక్కనే ఉంటున్న అతడి తమ్ముడికి సమాచారం ఇచ్చింది. ఇంట్లో బంగారం, నగదు పోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా మండల కేంద్రానికి చెందిన ఎర్ర నాగరాజుగౌడ్ పట్టుకొని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి శ్రీ వేంకటేశ్వర దేవాలయానికి సంబంధించి ఆరు తులాల బంగారం, వెండి, రూ.6 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. దేవాలయాన్ని సొంతంగా శ్రీనివాస్‌గౌడ్ కట్టించగా ఆభరణాలు ఇంట్లో దాచి పెట్టారు.

కడుపునొప్పి భరించలేక బాలిక ఆత్మహత్య


ప్రవళిక(ఫైల్)

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఉరేసుకొని బాలిక ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని మునిగడపలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన నర్ర బాలేశం, నాగలక్ష్మీ దంపతులకు కుమారుడు, కూతురు ప్రవళిక(13) ఉన్నారు. గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో 8వ తరగతి చదువుతున్న ప్రవళిక రెండ్రోజుల కిందట బంధువుల ఇంట్లో జరిగిన శుభ కార్యానికి వెళ్లి గురువారం ఇంటికొచ్చింది. తల్లి బట్టలు ఉతుకుతుండగా కడుపులో నొప్పి వస్తుందని చెప్పి ఇంట్లోకి వెళ్లింది. బయట నుంచి తల్లి నాగలక్ష్మీ పిలిచినా రాకపోవడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించింది. కూతురు మృతితో నాగలక్ష్మీ రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పురుగు మందు తాగి వివాహిత

కోహెడరూరల్(హుస్నాబాద్): పురుగు మందు తాగి వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని తీగలగుట్టపల్లె గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ అభిలాష్ కథనం మేరకు.. వేల్పుల విమల (40) కొద్ది రోజులుగా గర్భాశయ సమస్యతో చికిత్స పొందుతోంది. ఈ క్రమంలో తరుచూ కడుపునొప్పి వస్తుండటంతో తీవ్ర ఇబ్బంది పడుతుంది. దీంతో మనస్తాపం చెందిన ఆమె మంగళవారం పురుగు మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గమనించిన కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో కరీంనగర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలి భర్త కొమురయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పంటల మార్పిడిపై అవగాహన తప్పనిసరి


మాట్లాడుతున్న వ్యవసాయ నిపుణులు

చేగుంట(తూప్రాన్): మహిళా రైతులు పంటల మార్పిడిపై అవగాహన పెంచుకోవాలని ఐఐఆర్ఆర్ శాస్త్రవేత్త మహేందర్ కుమార్ అన్నారు. మండలంలోని వడియారంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సెహగల్ ఫౌండేషన్ హైటెక్ సీడ్‌ల ఆధ్వర్యంలో మహిళా రైతుల మినీ కిసాన్ మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్ కుమార్ మాట్లాడుతూ.. మహిళా రైతులు పంటల మార్పిడి, నీటి ఎద్దడి తట్టుకునే పంటలను ఎంచుకోవడం, ఆధునిక వ్యవసాయంపై అవగాహన కల్పించారు. సంవత్సర కాలంలో సెహగల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా రైతులకు వ్యవసాయంపై అందిస్తున్న ప్రోత్సాహం గురించి సెహగల్ ఫౌండేషన్ లీడ్ వాణి వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణ, ఏడీఏ రాజ్‌నారాయణ, ఏఈ హరిప్రసాద్, డాక్టర్ రవికుమార్, మొహినొద్దీన్, విభ, గాయత్రీ, బిందు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు విజయ్, శ్రవణ్, మహిళా రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా ముందుకు

డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి


పనులకు శంకుస్థాపన చేస్తున్న నర్సారెడ్డి

వర్గల్(గజ్వేల్): తాను పుట్టిన ఊరు, రాజకీయ జన్మనిచ్చిన వర్గల్‌కు జీవితాంతం రుణపడి ఉంటానని, గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి పరుస్తానని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గురువారం వర్గల్ ఎస్సీ వాడలో రూ. 40 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ఆర్థిక కష్టాలు అధిగమిస్తూ సీఎం రేవంత్ రెడ్డి అద్భుత పాలన కొనసాగిస్తున్నారని, అడిగిన వెంటనే గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధికి రూ. 5 కోట్లు కేటాయించారన్నారు. మరోవైపు వివిధ పనుల ద్వారా గజ్వేల్ అభివృద్ధికి రూ. 200 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించినట్లు తెలిపారు. రైతులకు అండగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలతో మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్ నుంచి పంటలకు సాగునీరు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మోహన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సందీప్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ఎదుట ముగ్గు వేస్తుండగా..

వృద్ధురాలి మెడలోంచి గొలుసు చోరీ



తూప్రాన్: వృద్ధురాలి మెడలోంచి గొలుసు చోరీ చేసిన ఘటన పట్టణ కేంద్రంలోని ఎల్లమ్మ కామాన్ వద్ద గురువారం చోటు చేసుకుంది. సీఐ రంగాకృష్ణ కథనం మేరకు.. ఎల్లమ్మ కమాన్ వద్ద నివాసం ఉంటున్న రంగమ్మ అనే వృద్ధురాలు ఇంటి ఎదుట ముగ్గు వేస్తుంది. ఓ అపరిచిత యువకుడు వృద్ధురాలితో కిరాణం దుకాణం ఎక్కడ ఉందనిని అడిగాడు. అంద్రస్ చెప్పేలోపు ఆమె మెడలోంచి ఆరు తులాల బంగారు గొలుసును తెంపుకొని పారిపోయాడు. వెంటనే ఆమె కేకలు వేయడంతో స్థానికులు వెంబడించారు. దొంగ వెంట తెచ్చుకున్న బైక్‌ను వదిలేసి పారిపోయాడు. విషయం తెలుసుకున్న సీఐ రంగాకృష్ణ బాధితురాలిని విచారించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. త్వరలోనే నిందితుడిని పట్టుకుంటామని తెలిపారు.

బాగా చదవాలి.. ఉన్నతస్థాయికి ఎదగాలి

అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్


విద్యార్థులతో మాట్లాడుతున్న గరిమా అగర్వాల్

సిద్దిపేటరూరల్: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ విద్యార్థులకు సూచించారు. గురువారం మండల పరిధిలోని రాఘవాపూర్ కస్తూర్బా గురుకుల పాఠశాలను అదనపు కలెక్టర్ సందర్శించారు. పాఠశాల అవరణ అంతటా తిరుగుతూ వంటగది, స్టోర్‌రూం, తరగతి గదులను పరిశీలించారు. అనంతరం టెన్త్ విద్యార్థులతో మాట్లాడుతూ పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, టెన్త్ ఉత్తీర్ణతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, జెడీపీసీఈఓ రమేశ్, ఎంపీడీఓ మురళీధర్‌శర్మ, మెడికల్ ఆఫీసర్ బాబు, ఎంఈఓ రాజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, ఇన్‌చార్జి స్పెషల్ ఆఫీసర్ లక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

18న జిల్లా బ్రాహ్మణ సంఘం ఎన్నికలు

తూప్రాన్: జిల్లా బ్రాహ్మణ సంఘం ఎన్నికలు ఈనెల 18న పట్టణంలోని దేవి గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల ప్రధాన అధికారి సోమయాజుల రవీంద్రశర్మ, సహాయ ఎన్నికల అధికారులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025- 28 కాలపరిమితికి గాను ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలు సజావుగా సాగడానికి అన్నిరకాల చర్యలు తీసుకుంటామన్నారు. సంఘంలో సభ్యత్వం ఉన్నవారు ఎవరైన పోటీ చేయవచ్చు అని సూచించారు.

కూడవెల్లి వాగులోకి నీరు విడుదల

గజ్వేల్‌రూరల్: మల్లన్నసాగర్ కాలువ నుంచి కూడవెల్లి వాగులోకి నీటిని విడుదల చేశారు. మండల పరిధిలోని కొడకండ్ల వద్ద గురువారం కాంగ్రెస్ నాయకులు మల్లన్నసాగర్ కాలువ నుంచి కూడవెల్లి వాగులోకి గోదావరి జలాలను వదిలారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏఎంసీ వైస్‌చైర్మన్ సర్దార్‌ఖాన్, నాయకులు గుంటుకు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

విద్యతోపాటు ప్రకృతిని కాపాడాలి


ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు

కౌడిపల్లి(నర్సాపూర్): భవితరాల భవిష్యత్ కోసం విద్యతోపాటు ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని డబ్ల్యూఈఓ (ప్రపంచ పర్యావరణ సంస్థ) వ్యవస్థాపక అధ్యక్షుడు భద్ర తెలిపారు. మండలంలోని దేవులపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో గదుల సమస్య ఉండటంతో హెచ్‌అండ్‌ఆర్ బ్లాక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, డబ్ల్యూఈఓ ఆధ్వర్యంలో రూ.1.50 లక్షలతో వరండాలో గోడలు నిర్మించి గ్రిల్స్ ఏర్పాటు చేసి గురువారం అధికారులు, గ్రామస్తుల సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేవ్ నేచర్, సేవ్ ఫ్యూచర్ నినాదంతో ప్రకృతిని కాపాడాలన్నారు. విద్యార్థులు చదువుతోపాటు ప్రకృతిని ప్రేమించి మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. హెచ్‌అండ్‌ఆర్ టీమ్ లీడర్ హరీశ్ మాట్లాడుతూ.. విద్యార్థుల అభివృద్ధి కోసం తమవంతు కృషి చేశామని తెలిపారు. అనంతరం అధికారులు, సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలరాజు, హెచ్‌ఎం క్రిష్ణమూర్తి, సంస్థ ప్రతినిధులు రామక్రిష్ణ, శిల్పిక, రిజ్వాన్, మిథిలేష్, అనంత్‌సారథి, యుగేందర్, ఉపాధ్యాయులు చైతన్య, వీనారాయ్, సందీప్, నరేందర్, నాయకులు సత్తయ్య, శివరాజ్, మహబూబ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి నిధులు కేటాయించాలి

ఏబీవీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏఓకు వినతి


కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

సిద్దిపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న బడ్జెట్‌లో విద్యాశాఖకు 15 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఏఓ రెహమన్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సావుల ఆదిత్య మాట్లాడుతూ.. విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొస్తున్నామని, అధిక నిధులు కేటాయించి విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తామని హామీలిచ్చిన కాంగ్రెస్ నేడు విద్యారంగంపై సవతితల్లి ప్రేమను చూపిస్తుందన్నారు. గత సంవత్సరం బడ్జెట్‌లో కేవలం 7 శాతం నిధులే కేటాయించి, వాటిని కూడా విడుదల చేయలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయించి, బకాయిలను అందించాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీపతి, నగర ఉపాధ్యక్షుడు రాకేశ్, సర్దార్ వల్లాబాయి పటేల్ జోన్ ఇన్‌చార్జి సాయిశంకర్, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

భవానీ మాత ఆలయంలో చోరీ



జహీరాబాద్: జహీరాబాద్ మండలంలోని రంజోల్ గ్రామంలో గల పురాతన భవానీమాత ఆలయంలో చోరీ జరిగింది. బుధవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ఆలయం ప్రధాన ద్వారం తాళం పగులగొట్టి భవానీమాత విగ్రహాన్ని ఎత్తుకెళ్లారు. మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడు, వెండి కాలిమెట్టలు, కిరీటాన్ని ఎత్తుకెళ్లినట్లు గ్రామ ప్రజలు పేర్కొన్నారు. విగ్రహాన్ని ధ్వంసం చేసి జాతీయ రహదారిపై పడేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆలయాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

హిందూ సంఘాల ధర్నా

భవానీమాత విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ హిందూ సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ, ధర్నా నిర్వహించారు. గురువారం రాత్రి మండలంలోని రంజోల్ గ్రామంలో ర్యాలీ అనంతరం 65వ జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శివలింగం ఆందోళన కారులతో మాట్లాడి 24 గంటల్లో నిందితులను పట్టుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించినట్లు హిందూ సంఘాల నాయకులు పేర్కొన్నారు.

పట్టపగలే ఇంటో..

అక్కన్నపేట(హుస్నాబాద్): పట్టపగలే ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడిన ఘటన అక్కన్నపేట మండలం అంతక్కపేట గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన రాయికుంట రాజమొగలి ఇంట్లో గురువార మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు బీరువా పగులగొట్టి తులం బంగారం అపహరించారు. ఇంటి తలుపులు దగ్గర వేసి బయటకు వెళ్లిన భార్య తిరిగి ఇంటికొచ్చి చూసేసరికి తలుపులు తెరిచి ఉండటంతో దొంగతనం జరిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ విజయ్ భాస్కర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చట్టాలను సద్వినియోగం చేసుకోవాలి

న్యాయమూర్తి స్వాతిరెడ్డి


మాట్లాడుతున్న న్యాయమూర్తి స్వాతిరెడ్డి

సిద్దిపేటజోన్: మహిళలకు అన్ని రకాల చట్టాలు అందుబాటులో ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, న్యాయమూర్తి స్వాతిరెడ్డి సూచించారు. గురువారం స్థానిక టీటీసీ భవన్‌లో స్వార్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. మహిళలు, పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో సమానంగా పనిచేస్తున్నారన్నారు. న్యాయ సలహాలు, సూచనల కోసం 15100 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, ప్రతినిధులు పాల్గొన్నారు.

మంచి నీరు ఎక్కువగా తీసుకోవాలి

- సిద్దిపేట ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శాంతి
- జీజీహెచ్‌లో వరల్డ్ కిడ్నీ డే వేడుకలు


కిడ్నీ బాధితుడితో మాట్లాడుతున్న డాక్టర్ శాంతి, డాక్టర్ మదన్

సిద్దిపేటకమాన్: ప్రతి ఒక్కరూ మంచి నీరు ఎక్కువగా తీసుకుంటే కిడ్నీ సంబంధిత వ్యాధులు దరిచేరవని సిద్దిపేట ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శాంతి తెలిపారు. వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల అనుబంధ జనరల్ ఆస్పత్రి డయాలసిస్ సెంటర్‌లో జనరల్ మెడిసిన్ విభాగ హెచ్ఓడీ డాక్టర్ మదన్‌తో కలిసి డాక్టర్ శాంతి గురువారం కేక్ కట్ చేశారు. ఆమె మాట్లాడుతూ.. 15 పడకలతో డయాలసిస్ సేవలు అందించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతంగా ఉండడానికి మంచి ఆహారం తీసుకోవాలన్నారు. మద్యపానం, ధూమపానానికి దూరంగా ఉండాలన్నారు. అనారోగ్య సమస్యలు తలెత్తితే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జనరల్ మెడిసిన్ విభాగ హెచ్ఓడీ డాక్టర్ మదన్, ఆర్ఎంఓలు జ్యోతి, సదానందం, శ్రావణి, డయాలసిస్ సెంటర్ ఇన్‌చార్జి రాజు, సిబ్బంది నరేశ్, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.